TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY | MEDCHAL /MALKAJGIRI | VOLUME:1 | ISSUE:12 | WEDNESDAY ,MAY 20,2026 | PAGES:8 | COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి | మేడ్చల్ /మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 12 | బుధవారం 20 మే 2026 | పేజీలు :8 | వెల: 4/-

## తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా

హంసకలం వార్త మే 19

రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ కేబినేట్ సమావేశం జరగనుందని సమాచారం. గతంలో మేడారంలో కేబినేట్ నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇప్పుడు యాదగిరిగుట్టలో కేబినేట్ నిర్వహించేందుకు ఆదేశంచినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 జరగాల్సిన కేబినేట్ సమావేశాన్ని 23న నిర్వహించాలని, అదికూడా యాదాద్రిలో నిర్వహించనున్నట్లు సమాచారం. 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న 'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, - మిగతా 2లో



## పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం



హంసకలం వార్త మే 19

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు-రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని - మిగతా 2లో

## భారత పర్యటనకు రష్యా అధ్యక్షుడు పుతిన్..

- సెప్టెంబర్‌లో రానున్న రష్యా అధ్యక్షుడు
- ధృవీకరించిన రష్యా అధ్యక్ష భవనం
- బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనున్న పుతిన్
- ఏడాది వ్యవధిలో రెండోసారి భారత్‌కు




## ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

హంసకలం వార్త మే 19

ఎబోలా వ్యాప్తిని నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను బలోపేతం చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనిలో భాగంగా వ్యాధి వ్యాప్తి చెందిన ఆఫ్రికా ప్రాంతాల నుండి వచ్చే విమాన ప్రయాణికులను పరీక్షించడంతో పాటు, వీసాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డిఆర్ సి)లో ప్రాణాంతకమైన ఎబోలా వ్యాప్తిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఒ) - మిగతా2లో



## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం


హంసకలం వార్త మే 19

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా ఎం పాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో - మిగతా 2లో

## నగరంలో వరుస అత్యాచారాలు


హంసకలం వార్త మే 19

నగరంలో దారుణాలు వెలుగు చూస్తున్నాయి. అమ్మాయిలను మోసం చేసి అత్యాచారాలు చేస్తున్నారు. కేసులు నమోదవుతున్నా భయం లేకుండా తెగిస్తున్నారు. సికింద్రాబాద్‌లో ఓ యువతి పై ఇద్దరు యువకులు రెండ్రోజుల పాటు అత్యాచారం సాగించారు. ఇబ్రహింపట్నంలో ఓ బిటెక్ విద్యార్థిని పై - మిగతా 2లో



## పేపర్ పులి"పై బాబురావు ఫైర్...

- పేపర్ పులి నేత పై కర్నే బాబురావు తీవ్ర విమర్శలు..
- కార్మిక ఉద్యమాన్ని స్వప్రచారానికి వాడుతున్నారంటూ ఆరోపణ..
- సింగరేణిలో డీజిల్ కుంభకోణం సహా పలు అవినీతులు బయటపెట్టానన్న బాబురావు..
- జీఎం కార్యాలయానికి రానివ్వొద్దని ఒత్తిళ్లు తెస్తున్నారని సంచలన..




## పాలమూరు ప్రాజెక్టుల పై బిఆర్ఎస్ మోసం

హంసకలం వార్త మే 19

బీఆర్ఎస్ నేతలకు పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 2015లో అప్పటి సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని. రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారని గుర్తు చేశారు. లక్ష కోట్ల ప్రాజెక్టును పదేళ్లలో రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెడితే 90 శాతం ఎలా పూర్తి అయినట్లు అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు తర్వాత మొదలుపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష కోట్లు ఖర్చు చేసి ఎలా పూర్తి చేశారని - మిగతా 2లో



## బండి బగీరథ్ కేసు.. మరో సిట్ ఏర్పాటు

హంసకలం వార్త మే 19

తెలంగాణలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు, బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో మరో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు విచారణ జరుపుతున్న హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియా వేదికగా జరిగిన అనుచిత, అవమానకర ప్రచారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. దీనిపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. జాయింట్ సీపీ శ్వేత ఆధ్వర్యంలో - మిగతా 2లో



# తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క – సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకుని రికార్డు సృష్టించారు. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని యాదగిరిగుట్ట లోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. బాసర అంత్య పుష్కరాల కారణంగా ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ వాయిదా పడటం, దానిని ఈ నెల 23న యాదగిరిగుట్టకు మార్చాలని యోచించడం అందులో భాగమే. అయితే ఈ మార్పు పై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

-మొదటిపేజీ తరువాయి

అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన నేపథ్యంలో, యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ఈ నివారణ చర్యలను చేపట్టింది. విమానాశ్రయాలలో స్క్రీనింగ్‌తో పాటు, గత 21 రోజులలోపు ఉగాండా, డి ఆర్ సి, దక్షిణ సూడాన్‌లకు ప్రయాణించిన అమెరికా యేతర పాస్‌పోర్ట్ హోల్డర్ల పై ప్రవేశ ఆంక్షలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉగాండాలోని కంపాలాలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం అన్ని వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేసి, ప్రభావితమైన దరఖాస్తుదారులకు సమాచారం అందించింది. డిఆర్‌సిలో ఉన్న ఒక అమెరికన్ సిబ్బందికి ఎబోలా వైరస్ సోకినట్లు డబ్ల్యుహెచ్ ఒ ప్రతినిధి సతీష్ పిళ్ళై ధృవీకరించారు. ఆ వ్యక్తికి పరీక్షల్లో పాజిటివ్ గా నిర్ధారణ కావడంతో,చికిత్స నిమిత్తం జర్మనీకి తరలించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. అలాగే అతనితో పరిచయం ఉన్న మరో ఆరుగురిని క్వారంటైన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు తక్షణ ప్రమాదం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నామని, అయితే మారుతున్న పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నట్లు సిడిసి తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, ప్రస్తుతానికి ఇది ఆఫ్రికాకే పరిమితమైందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఎబోలా సంక్షోభంపై ట్రంప్ ప్రభుత్వం స్పందిస్తున్న తీరు పై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ ఒ) నుండి అధికారికంగా వైదొలగడం, గతంలో ఎబోలా నివారణలో కీలక పాత్ర పోషించిన 'యుఎస్ ఎఐడి' (యుఎస్ ఎఐడి) నిధులలో కోత విధించడం ప్రస్తుత నియంత్రణ ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం చూపిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం తీసుకుంటున్న ప్రయాణ నిషేధాలు కేవలం నాటకమేనని, ట్రంప్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా వెనుకబడి వ్యవహరిస్తోందని జార్జ్‌టౌన్ యూనివర్శిటీ నిపుణులు మాథ్యూ కావనాగ్ విమర్శించారు. గతంలో ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయం వల్ల వ్యాధిని వేగంగా అరికట్టగలిగారని, కానీ ఇప్పుడు వందలాది కేసులు నమోదై, తీవ్రంగా వ్యాపించిన తర్వాతే చర్యలు చేపట్టడం అమెరికా వ్యూహాత్మక వైఫల్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాము స్థానిక ఆరోగ్య సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, తక్షణ ప్రతిస్పందన చర్యల కోసం 13 మిలియన్ డాలర్ల సహాయాన్ని సమీకరించినట్లు సిడిసి ప్రకటించింది.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

-మొదటిపేజీ తరువాయి

అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఫైనాన్స్ శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. భార్య, భర్త, పిల్లలు, ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు కూడా నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల అమలుకు ఉపయోగ పడనుంది. అన్ని శాఖల అధికారులు ఉద్యోగుల వివరాలను పోర్టల్‌లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోపు సమాచారం నమోదు చేయని పక్షంలో భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్య పథకాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులు, పెన్షనర్లు అత్యవసర వైద్య సేవలను సులభంగా పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# నగరంలో వరుస అత్యాచారాలు

-మొదటిపేజీ తరువాయి

వివరాల్లోకి వెళితే...సినిమా షూటింగ్ ఆశచూపి ఓ యువతిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో ఇద్దరు యువతులు నివసిస్తున్నారు. సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారిలో ఓ యువతికి సినిమా షూటింగ్ ఉందంటూ యువకుడు మాయమాటలు చెప్పి నమ్మించాడు. సినిమా షూటింగ్ అనడంతో నమ్మిన యువతి.. యువకుడితో కలిసి సికింద్రాబాద్‌కు వెళ్లింది. సికింద్రాబాద్‌లోని గదికి తీసుకెళ్లిన యువకుడు.. తన స్నేహితుడితో కలిసి యువతిపై రెండు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిందితులు ఈనెల 16న ర్యాపిడో బుక్ చేయించి తిరిగి యువతిని ఇంటికి పంపించేశారు. బాధితురాలి శరీరంపై గాయాలు ఉండటంతో స్నేహితురాలు ఆమెను గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. అక్కడ వైద్యులు ఏం జరిగిందని ప్రశ్నించగా.. లైంగిక దాడి జరిగిన విషయాన్ని బాధితురాలు చెప్పింది. ఈ ఘటనపై బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఇద్దరు గుర్తుతెలియని యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇకపోతే ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. మద్యం తాగించి బీటెక్ చదువుతున్న యువతిపై తోటి విద్యార్థి అత్యాచారం చేశాడు. దీంతో బాధితురాలు ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ఉడుతల విజయ్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్‌కు చెందిన ఉడుతల ఉదయ్.. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు.

## పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

## భారత పర్యటనకు రష్యా అధ్యక్షుడు పుతిన్..

-మొదటిపేజీ తరువాయి

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ రానున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' మంగళవారం అధికారికంగా ధృవీకరించింది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక, రక్షణ రంగ బంధం బలపడుతున్న తరుణంలో పుతిన్ పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్–రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి వచ్చారు. ఆ సమయంలో మోదీతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చలు జరిపారు. ఆ పర్యటన జరిగిన ఏడాదిలోపే పుతిన్ రెండోసారి భారత్‌కు వస్తుండటం గమనార్హం.రష్యా–ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైన తర్వాత పుతిన్ గతేడాది డిసెంబర్‌లోనే మొదటిసారి భారత్‌లో అడుగుపెట్టారు. దానికి ముందు ఆయన 2021లో ఢిల్లీని సందర్శించారు. భారత్–రష్యా మధ్య ఏటా ఒకసారి ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యే సంప్రదాయం ఉంది. ఒక ఏడాది భారత్‌లో జరిగితే, మరో ఏడాది రష్యాలో ఈ వార్షిక సదస్సు జరుగుతుంది. భారత్ నేతృత్వంలో ఢిల్లీలో జరగబోయే ఈ ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ సదస్సులో.. ప్రపంచ భద్రతా సవాళ్లు, ఆర్థిక సహకారం బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై సభ్య దేశాల అధినేతలు చర్చించనున్నారు.

## పాలమూరు ప్రాజెక్టుల పై బిఆర్ఎస్ మోసం

-మొదటిపేజీ తరువాయి

పాలమూరు ప్రాజెక్టులపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గట్టు, కల్వకుర్తి, జూరాల, కోయిల్ సాగర్, భీమా అన్ని ప్రాజెక్టుల విషయంలో పక్షపాతం చూపారని మంత్రి మండిపడ్డారు. కల్వకుర్తి పంపులు బాగు చేయలేకపోయారన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులు సాధించలేకపోయారని తెలిపారు. కృష్ణా నీటిని పదేళ్లు ఏపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. గద్వాల్‌లోని ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పదేళ్లలో రిస్టోర్ చేయలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డితో స్వయంగా ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి చర్చించామని చెప్పారు. సీఎం కూడా పాలమూరు వాసి కాబట్టి.. ప్రాజెక్టుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కల్వకుర్తి కింద చేపట్టనున్న గొల్లపల్లి రిజర్వాయర్‌ను చేపట్టవద్దని బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు.

## బండి బగీరథ్ కేసు.. మరో సిట్ ఏర్పాటు

-మొదటిపేజీ తరువాయి

ఈ దుష్ప్రచార మూలాలను పూర్తిగా వెలికితీస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. బండి భగీరథ్‌కు సంబంధించిన ముందస్తు బెయిల్ పిటిషన్ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవి వద్దకు విచారణకు వచ్చింది. ఈ క్రమంలో కొన్ని ఐటీ సెల్స్, సోషల్ మీడియా హ్యాండిల్స్ వేదికగా ఆమెను లక్ష్యంగా చేసుకుని కొన్ని అనుచిత పోస్టులను సర్క్యులేట్ చేశారు. బండి భగీరథ్‌కు గనుక ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే, దానికి ప్రతిఫలంగా జస్టిస్ మాధవి దేవి భర్తకు బార్ కౌన్సిల్ చైర్మన్ పోస్ట్ ఇస్తారంటూ తీవ్ర ఆరోపణలతో కూడిన పోస్టులను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ వ్యవహారం న్యాయవ్యవస్థ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ కేసు విచారణ ప్రారంభంలోనే జస్టిస్ మాధవి దేవి తనపై జరుగుతున్న ఈ దుష్ప్రచారంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చట్టప్రకారం విచారణ జరిపే న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఇలాంటి పోస్టులు పెట్టడంపై దిగ్భ్రాంతి వ్యక్తమైంది.

# పేపర్ పులి"పై బాబురావు ఫైర్...

మణుగూరు, మే 19 ( హంసకలం వార్త )

సింగరేణి కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ స్వప్రచారంతో ముందుకు వస్తున్న పేపర్ పులి నాయకుడి పట్ల కార్మికులు అప్రమత్తంగా ఉండాలని పాత్రికేయుడు, సామాజిక సేవకుడు కర్నే బాబురావు హెచ్చరించారు. మంగళవారం మణుగూరులో మీడియాతో మాట్లాడిన ఆయన, ట్రేడ్ యూనియన్ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కార్మిక ఉద్యమానికే చెడ్డపేరు తీసుకొస్తున్నారని మండిపడ్డారు. అధికారులకు భజన చేయడం, శాలువాలతో తిరగడం, వ్యక్తిగత ప్రచారమే లక్ష్యంగా పెట్టుకొని కార్మికుల పేరుతో రాజకీయాలు చేయడం ఆ నాయకుడి అసలు స్వరూపమని విమర్శించారు. ప్రశ్నించే వారిపై అసత్య ప్రచారాలు చేస్తూ బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అలాంటి భజన రాజకీయాల పట్ల కార్మికులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు..

**అవినీతి అక్రమాలపై నిరంతర పోరాటం..**

సింగరేణి పరిధిలో జరిగిన పలు అవకతవకలను తాను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు కర్నే బాబురావు తెలిపారు. 2026లో ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో జరిగిన డీజిల్ కుంభకోణం, 2023లో మురళి మాన్‌పవర్ అవినీతి ఆరోపణలు, ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో టైల్స్ చోరీ, 2024లో కప్లింగ్ పుల్ దొంగతనం వంటి అంశాలను వెలుగులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. జీఎం కార్యాలయం నుంచి పాత కాటా వరకు నిర్మించిన రోడ్ల నాణ్యతా లోపాలను కూడా ప్రశ్నించినట్లు వెల్లడించారు..

**కార్మికుల కోసం చేసిన కృషి ఇదే..**

స్థానిక యువతకు ఓబీ కంపెనీల్లో 80 శాతం ఉద్యోగాలు కల్పించాలని ఎండీ, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసి కొంతమేర ఫలితం సాధించినట్లు తెలిపారు. ఎస్ఎంఎస్ ప్లాంట్ టెండర్లలో మస్టర్ విధానం అమలు చేస్తే సింగరేణికి లాభమని, టన్ను ప్రాతిపదిక టెండర్ల వల్ల కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయల లాభాలు వెళ్తున్నాయని డైరెక్టర్లకు వివరించినట్లు చెప్పారు. 2024లో చేసిన ఫిర్యాదుల ఫలితంగానే సింగరేణి స్కూల్ బస్సులు పునఃప్రారంభమయ్యాయని తెలిపారు. రిటైర్డ్ కార్మికులు హెడ్ ఆఫీస్‌లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను మాజీ సీఎండీ బలరాం దృష్టికి తీసుకెళ్లడంతో, మాజీ కార్మికులు నేరుగా అధికారులను కలిసేలా ఆదేశాలు వెలువడ్డాయని పేర్కొన్నారు.

**జీఎం కార్యాలయానికి రానివ్వొద్దని ఒత్తిళ్లు..**

తన అవినీతి వ్యతిరేక పోరాటాన్ని జీర్ణించుకోలేక పేపర్ పులి నాయకుడు తనపై టార్గెట్ పెట్టాడని కర్నే బాబురావు ఆరోపించారు. కొందరు అధికారులతో అంతర్గత ఒప్పందాలు చేసుకొని తనను జీఎం కార్యాలయానికి రానివ్వవద్దని ఏజీఎం పర్సనల్, జీఎంకు ప్రత్యేక అధికారి, భద్రతా సిబ్బందికి మౌఖిక ఆదేశాలు ఇప్పించాడని తెలిపారు. ఇది ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు.

**నేను బ్లాక్‌మెయిలర్‌ను కాదు..**

తాను పగిడేరు ప్రాంతానికి చెందిన ఎస్సీ కుటుంబంలో జన్మించానని, తన తండ్రి మాజీ సింగరేణి కార్మికుడని కర్నే బాబురావు పేర్కొన్నారు. ఓబీ కంపెనీలను బ్లాక్‌మెయిల్ చేసే పరాన్నజీవి కాదని స్పష్టం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం జరిగితే ఎవరైనా ఎదురొడ్డి పోరాడతానని హెచ్చరించారు. ఆ నాయకుడిపై వ్యక్తిగత విభేదాలు లేవని, విపరీత ధోరణి మార్చుకొని సింగరేణి పరిరక్షణ, కార్మిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ప్రచార పిచ్చి తగ్గించుకోకపోతే కార్మికులే తగిన బుద్ధి చెబుతారని తీవ్రంగా హెచ్చరించారు. కొంతమంది అధికారులు కూడా ఇలాంటి వ్యక్తులకు వత్తాసు పలకకుండా హుందాగా వ్యవహరించాలని కోరారు..

# సంపాదకీయం

## 'తుమ్మిడిహెట్టి'పై కుట్రలు మాని బీజేపీ కలిసిరావాలి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి, వార్ధా, పెన్ గంగ, ప్రాణహిత వంటి నదులు.. కడెం, ధోతి వాగు, పెద్ద వాగు, కుప్టి వాగు, సాత్నాల వాగు వంటి ఇంకా అనేక వాగులు, వంకలు ప్రవహిస్తున్నా అవేవి పెద్దగా భూములను తడపడం లేదు. ఉప్పు నీటి సముద్రం వైపు ఉరకలేస్తూ వెళుతున్నాయి. ఇక్కడి నుంచి వెళ్లే ప్రతి చుక్కను ఒడిసిపట్టి ఈ జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు, హైదరాబాద్ నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు అందించాలనే సంకల్పంతో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత--చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి తుమ్మిడిహెట్టి వద్ద శ్రీకారం చుట్టింది. ఉత్తర తెలంగాణ భూముల్లో బంగారు పంటలు పండించేందుకు వీలుగా ఈ పథకానికి రూపకల్పన చేసింది. రూ.11,500 కోట్ల విలువైన పనులు కూడా పూర్తి చేసింది. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలనే సంకల్పంతో ఉమ్మడి రాష్ట్రంలోనే శ్రీపాద ఎల్లంపల్లి, మానేరు నదిపై మధ్యమానేరు జలాశయాల పనులను అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉమ్మడి రాష్ట్రంలోనే పూర్తయింది. మధ్యమానేరు పనులు దాదాపు సగం పూర్తయ్యాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పడడంతో ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు పూర్తవుతుందని ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు మిగతా జిల్లాల ప్రజలు ఎంతగానో ఆశపడ్డారు. ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం రీడిజైనింగ్ పేరుతో ప్రాణహిత--చేవెళ్ల పథకాన్ని కాళేశ్వరం ఎత్తిపోతలుగా మార్చి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రయోజనాలకు గండికొట్టింది. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందించడంతో పాటు చాలా తక్కువ గ్రావిటీతో శ్రీపాద ఎల్లంపల్లి వరకు నీళ్లను తరలించవచ్చు. అక్కడి నుంచి పలు దశల్లో వర్షాభావ ప్రాంతాలైన చేవెళ్ల, తాండూరు, పరిగి ప్రాంతాలకు నీటిని ఎత్తిపోయవచ్చు. కానీ స్వప్రయోజనాల కోసం కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చేపట్టింది. తుమ్మిడిహెట్టి వద్ద అయినా, కాళేశ్వరం వద్ద అయినా నీటి లభ్యతకు ప్రాణహిత నదే ఆధారం. ఎగువన ఉన్న తుమ్మిడిహెట్టి వద్ద ఉన్న నీరే దిగువన కాళేశ్వరం వద్ద అందుబాటులో ఉంటుంది. తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే, 100 టీఎంసీలు నీరు వినియోగించుకోవచ్చని జలవనరుల నిపుణులు తేల్చి చెప్పారు. 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రకు చెందిన శివుని గ్రామం ఒక్కటే ప్రభావితమవుతుంది. సుమారు 1100 ఎకరాలు ముంపునకు గురవుతుందని, ఆ భూములకు చెందినవారే నిర్వాసితులవుతారని అప్పటి అధ్యయనాలే వెల్లడించాయి. కానీ ఇవేం పట్టించుకోని కేసీఆర్ రీడిజైనింగ్ పేరుతో రూ.లక్ష కోట్లతో మూడు బ్యారేజీలు నిర్మించారు. భారతదేశంలో భాక్రానంగల్, హీరాకూడ్; ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి భారీ ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మాణమయ్యాయి. దశాబ్దాలు గడుస్తున్నా అవి చెక్కుచెదరలేదు. కానీ కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల అవినీతి కారణంగా కాళేశ్వరం పట్టుమని పదేళ్లు కూడా నిలవలేదు. గోదావరికి వచ్చిన వరదకు కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయి కేసీఆర్ కుటుంబం అవినీతిని ప్రపంచానికి చాటింది. కాళేశ్వరం నిర్మాణంతో పాటు దాని నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండలా తయారైంది. ప్రాణహిత--చేవెళ్లలో భాగంగా నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి, మధ్య మానేరు, కాలువలు, ఇతర నిర్మాణాలను కూడా కాళేశ్వరంలో చూపుతూ అదంతా తమ ఘనతే అని కేసీఆర్, ఆయన పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మించడానికి పూనుకున్నారు. తమ చిరకాల స్వప్నమైన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. దీని నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టే ప్రాజెక్టుతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే కాకుండా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాలకు ప్రయోజనం కలుగుతుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, చేవెళ్ల లోక్‌సభ స్థానాలను బీజేపీ గెలుచుకుంది. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర మంత్రి అయ్యారు. వారంతా ప్రాతినిధ్యం వహించే ప్రాంతాలకు సాగునీరు, ఆయా ప్రాంతాల్లోని పరిశ్రమలకు అవసరమయ్యే నీరు, హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించే ఈ పథకానికి కేంద్రం నుంచి అనుమతులు తీసుకువచ్చే బాధ్యత ఇక్కడి నుంచి గెలుపొందిన గొడం నగేష్, ధర్మపురి అర్వింద్, మాధవనేని రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలపై ఉంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రితో మన ముఖ్యమంత్రి భేటీ అయ్యి ముంపు సమస్యను పరిష్కరించి ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పిస్తే, తాము రాజకీయంగా సమాధి అవుతామనే భయం ఆ నేతలను వెంటాడుతోంది. అందుకే ఆ భేటీ జరగకుండా తెరవెనుక మోకాలడ్డే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే జన్మించి రాజకీయంగా ఉన్నత పదవులు సాధించడమే కాకుండా మహారాష్ట్రకు గవర్నర్‌గా సేవలందించిన చెన్నమనేని విద్యాసాగర్ రావు తనకున్న పలుకుబడితో దేవేంద్ర ఫడ్నవీస్‌ను భేటీకి ఒప్పించాలి. ఒకప్పుడు గోదావరి జలాల కోసం పాదయాత్ర చేసిన చరిత్ర విద్యాసాగర్‌రావుకు ఉంది. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణలోని వర్షాభావ ప్రాంతాలతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ముంపు, నిర్వాసితులు వంటి సాకుతో మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకులు తుమ్మిడిహెట్టికి గండి కొట్టాలనుకుంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకులు ఒకటి గుర్తుంచుకోవాలి. రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టు ముంపు కోసమని ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని కూనవరం, చింతూరు, వరరామచంద్రపురం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను పూర్తిగా, భద్రాచలం పట్టణం మినహా భద్రాచలం మండలం మొత్తాన్నీ, బూర్గంపాడు మండలంలోని మెజారిటీ గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. పోలవరం ప్రాజెక్టు కింద విలీన మండలాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిధిలో సుమారు లక్ష మంది నిర్వాసితులవుతున్నారు.. వేలాది ఎకరాలు ముంపునకు గురవుతోంది. నిర్వాసితులయ్యే వారిలో అత్యధికులు కోయ, కొండరెడ్డి జాతులకు చెందిన గిరిజనులు... అయినా విశాల ప్రజాప్రయోజనాల కోసం పోలవరం ప్రాజెక్టును కేంద్రం తన నిధులతో చేపడుతోంది. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో చేపట్టే ప్రాజెక్టుతో ముంపునకు గురయ్యే గ్రామం ఒక్కటే. తెలంగాణ ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీ ఎంపీలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పించాలి. లేకుంటే తెలంగాణ భవిష్యత్ తరాలు బీజేపీ ప్రభుత్వాన్ని, బీజేపీ నాయకులను క్షమించరు.

# ప్రజాస్వామ్యమా, రాజకీయ మాయా








ప్రపంచ రాజకీయ చరిత్రలో 'ప్రజాస్వామ్యం' అనే పదానికి వచ్చినంత పవిత్రత మరే రాజకీయ సిద్ధాంతానికీ రాలేదు. వర్తమాన ప్రపంచంలో ప్రతి ప్రభుత్వం తనను 'ప్రజాస్వామ్య' ప్రభుత్వంగానే ప్రకటించుకుంటోంది. ప్రతి యుద్ధం, ప్రతి ఆర్థిక విధానం, ప్రతి చట్టం-- ప్రజాస్వామ్యం పేరుతోనే సాగుతున్నాయి. ఇరాన్ మీద యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాడిన రాజకీయ ఆయుధం 'పాలనమార్పు' (=వస్త్రఅవవ ఎఘ్మఅస్త్రవ). అంటే, ఇరాన్‌లో నియంతృత్వాన్ని అంతంచేసి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుతామని నమ్మబలికాడు. ఆ మంత్రం ప్రభావవంతంగా పనిచేసింది. ఆ దెబ్బకు ఇరాన్ మీద అమెరికా--ఇజ్రాయెల్ జంటదాడిని ఖండించడానికి కూడ అనేక దేశాలు జంకాయి. ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తామంటే హజార్ ఖూన్ మాఫ్! కానీ, అత్యంత ముఖ్యమైన ప్రశ్న ఇక్కడే ఎదురవుతుంది. ప్రజాస్వామ్యం నిజంగా ప్రజల పాలనేనా? లేక ప్రజల పేరుతో నడిచే ఇతరుల అధికార వ్యవస్థనా మార్క్సిస్టులకు సాంప్రదాయంగా ప్రజాస్వామ్యం మీద ఎలాగూ నమ్మకం వుండదు. పెట్టుబడీదారీ వ్యవస్థ తనకు అనుకూలమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను రూపొందించుకుందన్నారు కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్స్ ముక్తకంఠంతో. అంచేత వాళ్ళ మీద ప్రజాస్వామ్య మంత్రం ప్రభావం చూపదు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, ముఖ్యంగా ముస్సోలినీ -- హిట్లర్ల ఫాసిస్టు, నాజీయిస్టు నియంతృత్వాలను చూసిన తరువాత ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం మీద వ్యామోహం ప్రమాదకరంగా పెరిగింది. ఈ 'పవిత్ర మాయాజాలా'న్ని ఛేదించడానికి ప్రయత్నించినవాళ్లలో ప్రముఖ రాజనీతి శాస్త్రజ్ఞుడు జాన్ డన్న్ ఒకడు. 'ప్రజాస్వామ్యపు మాయజాలం ఛేదింపు' అనే పుస్తకంలో అనేక దేశాల్లో క్రూరమైన నియంతృత్వమే ప్రజాస్వామ్యం ముసుగులో కొనసాగుతున్న తీరును అతను విశ్లేషించాడు. అనేక దేశాల్లో క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతున్నాయి. చట్టసభలు నడుస్తున్నాయి. అనేక చట్టాలు మెజారిటీ సభ్యుల ఆమోదం పొందుతున్నాయి. ప్రతిపక్షాలు కూడా సభలు సమావేశాలు నిర్వహించి తమ విధానాలను ప్రకటిస్తున్నాయి, అధికార పార్టీలను ఘాటుగా విమర్శిస్తున్నాయి. ఎన్నికల్లో కొన్నిచోట్ల అధికార పార్టీ ఓటమిపాలై ప్రతిపక్ష పార్టీ అధికారాన్ని చేపడుతోంది. ఇన్ని జరిగినా, ప్రజాస్వామ్యానికి నిఘంటువుల్లో అర్థం చెప్పినట్టు సమాజంలో జరుగుతోందా? తమ జీవితాలను తాము అనుకున్నట్టు మార్చుకునే అధికారం నిజంగా ప్రజల చేతుల్లో ఉంటోందా జాన్ డన్న్ వాదన ప్రకారం ప్రజాస్వామ్యం ఇప్పుడు ఒక రాజకీయ మత్తుమందుగా మారిపోయింది. ఎన్నికలు జరుగుతున్నాయనే కారణంతో ప్రజలు తమకు అధికారం ఉందని భావిస్తున్నారు. కానీ అసలు అధికార నిర్మాణాలు మాత్రం కార్పొరేట్ శక్తులు, మీడియా సామ్రాజ్యాలు, అంతర్జాతీయ పెట్టుబడి, భద్రతా వ్యవస్థల చేతుల్లోకి జారిపోతున్నాయి. ఇదే ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు అంతర్గత విషాదం. భారత రాజకీయ వ్యవస్థను గమనిస్తే ఈ వైరుధ్యాలు ఇంకా స్పష్టంగా కనిపిస్తాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యంగా భారత్‌ను చాలామంది ప్రశంసిస్తారు. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 64 కోట్లమంది ఓటింగులో పాల్గొన్నారు. వీరిలో 31 కోట్లమంది మహిళలు. ఈ అంకెల్ని చూస్తే ప్రపంచం నివ్వెరపోవాల్సిందే. అయితే, కులాధిపత్యం, ధన ప్రభావం, ఎన్నికల అవినీతి, మీడియా మానిప్యులేషన్, రాజకీయ నేరీకరణ, రాజకీయ మతీకరణ వగయిరాలన్నీ కలిసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నాయంటే అతిశయోక్తి కాదు. 'సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలబడదు' అని బీఆర్ అంబేడ్కర్ చాలాసార్లు హెచ్చరించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల్లోని 824 శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ వీటిల్లో ఒక్క సీటు కూడా ముస్లింలకు కేటాయించలేదు. సాక్షాత్తు ప్రధానమంత్రి స్థాయి నాయకులు ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని సాగించి హిందూ ఓట్లను ఆకర్షించడానికి ప్రయత్నించారు. బీజేపీకి ఓటు వేయనివారినీ, విపక్షాలకు మద్దతు తెలిపేవారినీ ఎన్నికల సంఘం ఏకంగా ఓటర్ల జాబితా నుండి తొలగించిందని విపక్షాలు అనేకసార్లు ఆరోపణలు చేశాయి. ఆ ఆరోపణలకు తగినట్టుగా, నిన్నటివరకు వెస్ట్ బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా పనిచేసిన మనోజ్‌కుమార్ అగర్వాల్‌ను ఆ రాష్ట్రానికి చీఫ్ సెక్రటరీగా నియమించారు. ఆ రాష్ట్రానికి స్పెషల్ ఎలక్షన్ ఆబ్జర్వర్‌గా వున్న డాక్టర్ సుబ్రత గుప్తాను ముఖ్యమంత్రికి ముఖ్య సలహాదారుగా నియమించారు. యుక్త వయస్సు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు, ప్రతి ఓటుకూ సమాన విలువ అని రాజ్యాంగం అంటే చాలామంది చాలాకాలం మైమరచిపోయారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం సమాన ఓటు హక్కు ఇవ్వగలదు, కానీ సమాన శక్తి ఇవ్వదు అని తెలుసుకోవడానికి చాలా కాలం పట్టింది. ఈ హెచ్చరిక ఇప్పుడు మరింత సత్యంగా కనిపిస్తోంది. ఎన్నికల ప్రజాస్వామ్యం కొనసాగుతోంది. కానీ సామాజిక అసమానతలు మరింత బలపడుతున్నాయి. రాజకీయ పార్టీలు ప్రజా ఉద్యమాల కంటే ఎన్నికల యంత్రాలుగా మారుతున్నాయి. పౌరులు క్రమంగా ఓటు బ్యాంకులుగా, డేటా యూనిట్లుగా మారుతున్నారు. ఇక పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నిజంగా ప్రజల సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందా? అనే ప్రశ్న కీలకమైనది. ప్రజలు ఐదేళ్లకోసారి ఓటు వేస్తారు. కానీ ఆ తర్వాత జరిగే వేలాది నిర్ణయాలన్నీ కార్పొరేట్ల అవసరాలు, లాబీయింగ్, రహస్య ఒప్పందాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ఒత్తిళ్ళు, మీడియా ప్రచార యుద్ధాలు, రాజ్యాంగ వ్యవస్థల కుమ్మక్కు వగయిరాల ఆధారంగా రూపుదిద్దుకుంటాయి. వీటికి అంతిమంగా 'ప్రజాస్వామ్య నిర్ణయం' అనే ముద్ర వేస్తే చాలు అది పవిత్రం అయిపోతుంది. ఇది ప్రజాస్వామ్యమా? లేక ప్రజాస్వామ్యం పేరుతో నడిచే వ్యవస్థీకృత రాజకీయ మాయా? ఎన్నికైన ప్రభుత్వాలు తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజల నిర్ణయమని భావించడం ఎంత ప్రమాదకరమో ప్రపంచం ఇరాక్ యుద్ధంలో చూసింది. ప్రజాస్వామ్య దేశాలుగా చెప్పుకునే అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు తమ దేశంలో కోట్లాది ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా యుద్ధం ప్రారంభించాయి. ఇరాక్‌లో 'వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్' (జేవీఐ) వున్నాయంటూ ఆ దేశంలోకి ప్రవేశించాయి. సద్దాం హుస్సేన్ చనిపోయినా ఆ జీవరసాయన వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్ జాడ కనిపించలేదు. ఇప్పుడు ఇరాన్ మీద దాడికీ అలాంటి నెపం ఒకటి వేశారు-- ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తున్నదని. యుద్ధం మొదలై 80 రోజులైనా ఎవరికీ వాటి జాడ కనిపించలేదు. ఈ యుద్ధానికి అమెరికా పౌరుల మద్దతువుందా? అదీ అనుమానమే. అయినప్పటికీ అమెరికాను గొప్ప ప్రజాస్వామిక దేశం అంటున్నారు. ఇక్కడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు అసలు సంక్షోభం బయటపడుతుంది. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. కానీ ప్రభుత్వాలపై ప్రభావం చూపేది ఎవరు-- సాధారణ పౌరులా? లేక కార్పొరేట్ పెట్టుబడిదారులా ప్రజాస్వామ్యం ఒకప్పుడు ప్రజలకు విముక్తి ఆశను ఇచ్చింది. రాజరికాలను, వలస పాలనలను, నియంతృత్వాలను సవాలు చేసే శక్తిగా ఎదిగింది. కానీ అదే ప్రజాస్వామ్యం ఇప్పుడు మార్కెట్ శక్తులతో కలిసిపోయి ప్రజలనే నిస్సహాయులుగా ఉంచేస్తోంది. 2011 మార్చి నెలలో జపాన్‌లోని ఫుకుషిమా అణు కేంద్రంలో జరిగిన ప్రమాదం దీనికి ఉదాహరణ. జపాన్‌లో ప్రజాస్వామిక ప్రభుత్వమే వుంది. అయినప్పటికీ, అది కార్పొరేట్ల ప్రయోజనాలను నెరవేర్చే క్రమంలో ప్రజల భద్రతను కూడా పక్కన పెట్టింది. ప్రజాస్వామ్యం ఉన్నంత మాత్రాన ప్రజల భద్రతకు హామీ వుంటుందని చెప్పడానికి వీల్లేదని ఫుకుషిమా సంఘటన నిరూపించింది. ఇదే నేటి ప్రపంచ సంక్షోభం. అయితే దీనికి పరిష్కారం నియంతృత్వమా? మతద్వేషానికి విరుగుడు మతద్వేషం కానట్టే, విఫలమైన ప్రజాస్వామ్యానికి విరుగుడు నియంతృత్వం కాదు. అయితే, ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడలేం. ఎన్నికల ప్రక్రియ మాత్రమే ప్రజాస్వామ్యం కాదు. ప్రజల జీవితాలపై నిజమైన నియంత్రణ, సమాచారం మీద ప్రజల హక్కు, ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం-- ఇవన్నీ లేకపోతే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం క్రమంగా ఒక క్రతువుగా మారిపోతుంది. ప్రజాస్వామ్యం పవిత్రగ్రంథం కాదు. అది ఒక రాజకీయ సాధనం మాత్రమే. ఆ సాధనం విముక్తి ఇవ్వగలదు, మత్తెక్కించగలదు, ప్రజలను శక్తివంతం చేయగలదు, మత ద్వేషాల్ని రెచ్చగొట్టగలదు, మోసం కూడా చేయగలదు. అందుకే మనం చెయ్యాల్సిన పని ప్రజాస్వామ్యాన్ని పూజించడం కాదు; దానిని అర్థం చేసుకోవడం. దాని మాయాజాలాన్ని ఛేదించడం. ప్రజాస్వామ్యాన్ని కేవలం ఎన్నికల పండుగ నుంచి ప్రజల నిజమైన భాగస్వామ్య వ్యవస్థగా మార్చడం. లేకపోతే 'ప్రజాస్వామ్యం' అనే పవిత్ర పదం చివరికి ప్రజల స్వరాన్నే మింగేసే రాజకీయ మత్తుమందుగా మారిపోవచ్చు. ముస్సోలిని, హిట్లర్ కూడ ముందు ప్రజాస్వామికంగానే ఎన్నికయ్యారనేది మరచిపోకూడదు.

# ఉద్యమకారుల ఏకతకు పిలుపు

-ఉద్యమకారుల గుర్తింపుకు ప్రత్యేక కమిటీ..
-కేసులు ఎదుర్కొన్న వారికే కమిటీల్లో చోటు..
-ఎఫ్ఐఆర్‌లు, పత్రిక కటింగ్స్ సిద్ధంగా ఉంచుకోండి..
-తెలంగాణ ఉద్యమకారులారా ఏకం కండి : గజెల్లి వెంకటయ్య..

మంచిర్యాల, మే 19 ( హంసకలం వార్త )

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2004 నుంచి 2014 వరకు వివిధ దశల్లో పోరాటం చేసి, ఉద్యమ జ్యోతి వెలిగించిన ప్రతి ఉద్యమకారునికి ఉద్య మాభివందనాలు తెలుపుతున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య పేర్కొన్నారు. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, ఉద్యమకారుల హక్కుల సాధన దిశగా ప్రతి ఒక్కరు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల అమలు దిశగా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతార్హమని తెలిపారు. ఈ కమిటీ నాలుగు దశల్లో ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియ చేపట్టనుండటంతో, 2004 నుంచి 2014 వరకు ఉద్యమంలో పాల్గొన్న వారు తమ ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఉద్యమ కేసులు ఎదుర్కొన్న వారు, బైండోవర్‌కు గురైన వారు, అరెస్టులు ఎదుర్కొన్న వారు తమ ఎఫ్ఐఆర్ ప్రతులు, పత్రికా కటింగ్స్, సంబంధిత ధృవపత్రాలను భద్రపరచుకోవాలని కోరారు. త్వరలో మండల, తాలూకా, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వ హించనున్నట్లు వెల్లడించారు. ఆ సమావేశాలకు ప్రతి ఉద్యమకారుడు తన ఆధారాలతో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. మండల, తాలూకా, జిల్లా స్థాయి ఉద్యమ కమిటీల్లో నిజంగా ఉద్యమంలో కేసులు ఎదుర్కొన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.



తెలంగాణ సాధన కోసం కష్టపడి పోరాడిన ఉద్యమకారులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ తమ హక్కులను కోల్పోకుండా జాగ్రత్త పడాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారులారా ఏకం కండి... అమరవీరుల త్యాగాలను మరు వొద్దు...జై తెలంగాణ అంటూ గజెల్లి వెంకటయ్య పిలుపునిచ్చారు..

# కూకట్‌పల్లిలో కేటీఆర్ భారీ సభ





ఫతేనగర్, మే 19 ( హంసకలం వార్త )

కూకట్‌పల్లిలో ఈనెల 25న జరగనున్న బీఆర్ఎస్ భారీ కార్యకర్తల సమావేశానికి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున సిద్ధమవుతున్నాయి. కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించే ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్, 2026తో పాటు రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై కీలక చర్చలు జరగనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సమావేశాన్ని విజయవంతం చేసేందుకు ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అధ్యక్షతన డివిజన్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ, కేటీఆర్ స్వయంగా హాజరవుతున్న ఈ సమావేశం పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైందని తెలిపారు. ఫతేనగర్ డివిజన్ నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, ప్రజల మధ్య పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లేది కార్యకర్తలేనని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈనెల 25న జరిగే సభకు ప్రతి కార్యకర్త తప్పనిసరిగా హాజరై కేటీఆర్ సందేశాన్ని వినాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 25న కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ భారీ కార్యకర్తల సభ

కూకట్‌పల్లి, మే 19 ( హంసకలం వార్త )

మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ ప్రాంత ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఈ నెల 25న ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించే బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఎమ్మెల్సీలు కె నవీన్ కుమార్, శంభీపూర్ రాజు సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఒక్క పనీ ముందుకు సాగలేదన్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో పాత ఓటర్ల పేర్లను కూడా తొలగిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్మించిన పార్కుల్లో మొక్కలకు నీళ్లు పోయలేని పరిస్థితి నెలకొన్నదని, అనవసర హోర్డింగులతో ప్రచారం తప్ప అభివృద్ధి కనిపించడం లేదన్నారు. హైదర్‌నగర్ నుంచి స్కైవే నిర్మాణానికి సిద్ధం చేసిన ప్రణాళికను కూడా అటకెక్కించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో కుల, మత భేదాలు లేకుండా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని, దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా పాలన సాగిందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో వ్యాపారాలు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కక్షపూరిత రాజకీయాలు తప్ప అభివృద్ధి రాజకీయాలు కనిపించడం లేదన్నారు. గతంలో ప్రారంభించిన డ్రైనేజీ పనులకు కూడా నిధులు విడుదల చేయడం లేదని, ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈనెల 25న జరిగే బీఆర్ఎస్



కార్యకర్తల సమావేశానికి ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, పి శ్యామలరాజు, బండి మధుసూదన్ రెడ్డి, యర్రా నాగేశ్వరరావు, బసల శ్రీనివాసరావు, సాయి చౌదరి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరాజు, జగన్, ధారాసింగ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

## డబుల్ బెడ్‌రూమ్ కాలనీలపై కేపీ వివేకానంద్ ఫైర్

-డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో సమస్యలపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సీరియస్..
-నీరు, విద్యుత్, రోడ్లు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు వార్నింగ్..
-రోజుకు రెండుసార్లు తాగునీరు విడుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు..
-కాలనీల్లో దేవాలయం, మసీదు, చర్చి స్థలాల కేటాయింపుపై కీలక సూచనలు..



పేట్ బషీరాబాద్, మే 19 ( హంసకలం వార్త )

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నిజాంపేట్, బాచుపల్లి, కైసర్ నగర్, దుండిగల్, డి. పోచంపల్లి, బహదూర్‌పల్లి, దేవేందర్ నగర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, మున్సిపాలిటీ, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొని కాలనీల్లో నెలకొన్న సమస్యలపై వివరాలు అందించారు. లబ్ధిదారులు నేరుగా తమ ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ దూరదృష్టితో సకల సౌకర్యాలతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి వేలాది కుటుంబాలకు అందించిందన్నారు. కానీ ప్రస్తుతం ఆ కాలనీల్లో కనీస మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా యుద్ధ ప్రాతిపదికన అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలు, వీధిదీపాల ఏర్పాటు, రహదారుల అభివృద్ధి, రవాణా సౌకర్యాల కల్పన వంటి అంశాలను అత్యవసరంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రోజుకు రెండు సార్లు తాగునీరు విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రతా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, కాలనీల్లో తగినన్ని వీధిదీపాలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి ఇంటి నెంబర్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి సొంతింటి భరోసా కల్పించాలని తెలిపారు. కాలనీల్లో ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేవాలయం, మసీదు, చర్చి, వైకుంఠధామాల నిర్మాణానికి తగిన స్థలాలు కేటాయించాలని అధికారులను కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను శాఖల సమన్వయంతో పరిష్కరించి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలను ఆదర్శ నివాస సముదాయాలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో నిజాంపేట్, బాచుపల్లి, కైసర్ నగర్, దుండిగల్, డి. పోచంపల్లి, బహదూర్‌పల్లి ప్రాంతాలకు చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొని తమ సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో గాజుల రామారం ఉప కమిషనర్‌తో పాటు ఇంజనీరింగ్ శాఖ, హౌసింగ్ బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, మున్సిపాలిటీ అధికారలు పాల్గొన్నారు

## యుజిడి పనులపై వెంకటేష్ గౌడ్ ఆకస్మిక తనిఖీ



ఆల్విన్ కాలనీ, మే 19 ( హంసకలం వార్త )

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసినగర్--2 కాలనీలో నూతనంగా చేపట్టిన భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. జరుగుతున్న పనుల పురోగతి, నిర్మాణ నాణ్యతపై అక్కడికక్కడే అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రజా ఖాతాల కమిటీ చైర్మన్ అరేకపూడి గాంధీ సహకారంతో డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూగర్భ మురుగు కాలువ నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కాలనీలో పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ఈ పనులు ఉపయోగపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. పనుల పరిశీలనలో దొడ్ల రామకృష్ణ గౌడ్, పోశెట్టి గౌడ్, నాగేష్ గౌడ్, అభి గౌడ్ పాల్గొన్నారు..

## ఎస్సీ హక్కుల పోరాట యోధుడు ఇకలేరు



శంకర్‌పల్లి, మే 19 ( హంసకలం వార్త )

శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామానికి చెందిన ఎస్సీ హక్కుల పరిరక్షణ సమితి నాయకుడు అంతిగల్ల రాజు (41) గుండెపోటుతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. సామాజిక సమస్యలపై ఎప్పుడూ ముందుండే రాజు ఆకస్మిక మరణంతో గ్రామ ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం అంతిగల్ల రాజుకు అకస్మాత్తుగా చేతిలో తీవ్ర నొప్పి రావడంతో వెంటనే శంకర్‌పల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఉదయం 9 గంటలకు తుదిశ్వాస విడిచారు. అంతిగల్ల రాజుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి అండగా నిలిచే వ్యక్తిని కోల్పోవడంతో వారి ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో ఎవరికైనా కష్టం వచ్చినా ముందుండి స్పందించే రాజు మృతి చెందడం బాధాకరమని జన్వాడ గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. అశ్రునయనాల మధ్య మంగళవారం సాయంత్రం జన్వాడ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతిగల్ల రాజు మృతి వార్త తెలిసి పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, గ్రామస్తులు నివాళు లర్పించారు

## లోపరహిత ఓటరు జాబితాల తయారీ అందరి బాధ్యత

-జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

-ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం షెడ్యూల్ పై రాజకీయ పార్టీలతో సమావేశం




( హంసకలం వార్త )

జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్ని జిల్లా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం షెడ్యూల్ పై సమావేశం నిర్వహించారు. 01.10.2026 అర్హత తేదీని ఆధారంగా చేసుకొని చేపట్టనున్న ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలు, షెడ్యూల్ మరియు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను సమావేశంలో వివరించారు. భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 15 నుండి 24 వరకు ఓటర్ లిస్ట్ తయారీ, సిబ్బంది శిక్షణ, ప్రింటింగ్ కార్యక్రమాలు, జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల స్వీకరణ చేసి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని వివరించారు. షెడ్యూల్ ప్రకారం బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు మరియు తొలగింపుల ప్రక్రియలను చేపడతారని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ, అభ్యంతరాలు మరియు క్లెయిమ్‌ల స్వీకరణ, తుది ఓటరు జాబితా ప్రచురణ తదితర కార్యక్రమాలు ఎన్నికల సంఘం నిర్దేశించిన తేదీల ప్రకారం నిర్వహించబడతాయని తెలిపారు. పారదర్శకమైన, ఖచ్చితమైన మరియు లోపరహిత ఓటరు జాబితాల తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయగా, నిబంధనల ప్రకారం వాటిని పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత , జగిత్యాల, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు మధు సూదన్, జివాకర్ రెడ్డి, నరసింహ రావు, తహసిల్దార్ లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

-కూలీల సమస్యలు తెలుసుకున్న కలెక్టర్

-సాగునీటి అభివృద్ధికి ఫీడర్ ఛానల్ పనులు కీలకం

-జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలి

-నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

( హంసకలం వార్త )

మంగళవారం కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్ గ్రామ పరిధిలో నాపగుంపు నుంచి పెద్దకుంట వరకు కొనసాగుతున్న ఉపాధి హామీ ఫీడర్ ఛానల్ పనులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఉదయం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, నాణ్యత, కూలీల హాజరు వివరాలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ పనిస్థలంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఇల్లు లేని అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయాలని, గ్రామీణ పేదల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, వారికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. కూలీలకు వేతనాలు సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొంతమంది కూలీలకు ఐసీఐసీఐ బ్యాంక్, గద్వాల బ్యాంకుల నుంచి చెల్లింపులు రావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే బ్యాంక్ మేనేజర్‌ను పిలిపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఫీడర్ ఛానల్ పనులు పూర్తయితే సాగునీటి వనరులు మెరుగుపడి



గ్రామంలోని సుమారు 50 మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని, చెరువులు, కుంటలు, కాలువల అభివృద్ధితో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పనులు కేవలం ఉపాధి కల్పనకే కాకుండా గ్రామాభివృద్ధికి దోహదపడేలా ఉండాలని, పనిస్థలాల్లో కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మహిళా కూలీల సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే హాజరు వివరాలు, మస్టర్ రోల్స్‌ను పరిశీలించిన కలెక్టర్ పనులు పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వ నిధులు ప్రజల అభివృద్ధికే వినియోగించబడాలని సూచించారు. అనంతరం అక్కడే చేపట్టున్న జల్ జీవన్ మిషన్ పరిధిలో చేపట్టనున్న ఓహెచ్‌ఎస్‌బీఆర్ పనులపై కూడా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతి, ప్రణాళికలు, గ్రామ ప్రజలకు అందించనున్న తాగునీటి సదుపాయాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంలో జల్ జీవన్ మిషన్ పనులు కీలకమని పేర్కొంటూ, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే పనుల అమలులో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేసు, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, పెద్దకొత్తపల్లి మండల తహశీల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## అప్రమత్తంగా ఉండాలి

-బస చేసేవారి గుర్తింపు ఆధారాలు సేకరించడం తప్పనిసరి.

-పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం.

( హంసకలం వార్త )

నగరంలో ఇటీవల పీఎంజే జ్యువెలరీలో జరిగిన భారీ దోపిడీ ఉదంతాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోటళ్లు, లాడ్జీల యజమానులు, నిర్వాహకులతో కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలునందు పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆయుధాలతో కూడిన ఓ అంతర్రాష్ట్ర దొంగల ముఠా నకిలీ ఆధార్ కార్డులు, తప్పుడు ఫోన్ నంబర్లు, తప్పుడు చిరునామాలు ఇచ్చి నగరంలోని పలు హోటళ్లలో దాదాపు రెండు నెలల పాటు బస చేసి, నిఘా (రెక్కి) నిర్వహించినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే ధ్యేయంగా పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా కఠినమైన మార్గదర్శకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో హోటళ్లు, లాడ్జీలకు ముఖ్య భద్రతా చర్యలపై సూచనలు చేశారు. హోటల్ లేదా లాడ్జీలలో రూములు కేటాయించే ముందు ప్రభుత్వ గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలి. కేవలం ఆధార్ కార్డులను గుడ్డిగా నమ్మకుండా అందులోని ఫోటో వయస్సు, చిరునామా అసలైనవా కాదా అని సరిచూసుకోవాలి. అవసరమైతే అదనపు గుర్తింపు కార్డులను అడగాలన్నారు. కస్టమర్లు ఇచ్చే మొబైల్ నంబర్ పనిచేస్తుందో లేదో క్రాస్-చెక్ చేసుకోవాలి. అది సదరు వ్యక్తి పేరు మీద ఉందో లేదో నిర్ధారించుకోవాలి. విదేశీయులు వస్తే నిబంధనల





ప్రకారం తక్షణమే సమాచారం అందించాలన్నారు. ప్రతి హోటల్‌లో హై-రెజల్యూషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. కనీసం 90 రోజుల ఫుటేజీని భద్రపరచాలి. గెస్ట్ రిజిస్టర్, ఐడీ ప్రూఫ్స్, వాహనాల వివరాలు, చెక్-ఇన్/చెక్-అవుట్ సమయాలను డిజిటల్ రూపంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు.లగేజీ లేకుండా రూమ్ తీసుకునేవారు, ఆయుధాలు లేదా అనుమానాస్పద బ్యాగులతో వచ్చేవారు, సీసీ కెమెరాల ముందుకు రాకుండా తప్పించుకునే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి. భారీ నగదు లావాదేవీలు చేసే వారి వివరాలను వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరవేయాలి.నిబంధనలు ఉల్లంఘించి, నిందితులకు ఆశ్రయం కల్పించినా లేదా పోలీసుల తనిఖీలకు సహకరించకపోయినా సదరు హోటల్ యాజమాన్యాలపై క్రిమినల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.అంతర్రాష్ట్ర నేరగాళ్ల కదలికలను అణచివేయడానికి కరీంనగర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత నిఘా, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.ఏసీపీ స్థాయి అధికారితో పోలీసు ప్రత్యేక టీము లాడ్జి మరియు హోటల్స్ భద్రత ప్రమాణాలపై తనిఖీలు చేసి పలు సూచనలు చేయనున్నట్లు తెలిపారు. సరిహద్దులు, వ్యూహాత్మక ప్రాంతాల్లో నాకా బందీ,నగరంలోని ప్రధాన కూడళ్లు, అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద పగలు, రాత్రి తేడా లేకుండా 'నాకా బందీ' (వాహనాల తనిఖీ) నిర్వహిస్తున్నారు. నకిలీ నంబర్ ప్లేట్లు, అద్దె వాహనాలు, తప్పుడు పత్రాలతో తిరిగే వారిని నిశితంగా పరిశీలిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, శివారు కాలనీలలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. కొత్తగా అద్దెకు దిగిన వారు, అనుమానాస్పద వ్యక్తులు మరియు పాత నేరస్థుల ఇళ్లలో తనిఖీలు చేస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో తనిఖీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు, జ్యువెలరీ షాపులు, ఫైనాన్స్ సంస్థల వద్ద బ్లూ కోల్ట్స్, టాస్క్‌ఫోర్స్ మరియు ప్రత్యేక పోలీస్ బలగాలతో నిరంతర పెట్రోలింగ్ పెంచడం జరిగిందన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నా, హఠాత్తుగా ఇళ్లు అద్దెకు తీసుకుని వింతగా ప్రవర్తిస్తున్నా, అనాథగా వాహనాలు వదిలేసి వెళ్లినా వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్, స్థానిక హోటల్స్,లాడ్జి నిర్వాహకులు, యజమానులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

( హంసకలం వార్త )

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల,షెట్ పల్లి లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు,నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు,తేమ



యంత్రాలు,ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటా యించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు



తరలించాలని తెలిపారు.ఈ కార్య క్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భార్యను అతి కిరాతకంగా నరికి చంపిన భర్త. పట్ట పగలు దారుణం

-హత్య తర్వాత నిందితుడు నేరుగా పోలీస్ స్టేషన్లో లొంగిపోయిన భర్త

-కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు

-రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ప్రతినిధి

( హంసకలం వార్త )

గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం పట్టపగలు దారుణ సంఘటన చోటుచేసుకుంది. కవాడిగూడలోని రత్నదీప్ బిల్డింగ్ నాలుగో అంతస్తు లో ఉన్న ఒక స్పా సెంటర్ లో పనిచేస్తున్న మహిళను ఆమె భర్తే కత్తితో పొడిచి అతి కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు స్పాట్‌కు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు బహదూర్ పురా కిషన్ బాగ్ ప్రాంతానికి చెందిన బంగి దేబోరా అనే మహిళగా గుర్తించారు. ఆమె కవాడిగూడలోని స్పా సెంటర్‌లో బ్యూటీషియన్ గా విధులు నిర్వహిస్తోంది. గత కొంతకాలంగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా భార్యా భర్తల మధ్య తీవ్రమైన గొడవ జరిగింది. ఆ గొడవ తర్వాత దేబోరా యథావిధి గా తనవిధులకు హాజరైంది కోపంతో రగిలిపోయిన భర్త, తన వెంట కత్తిని సిద్ధం చేసుకుని స్పా సెంటర్‌కు చేరుకున్నాడు. మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. అక్కడ విచక్షణ రహితంగా దేబోరాపై దాడి చేసి, కత్తితో పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘాతుకానికి ఒడిగట్టిన అనంతరం నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు, క్లూస్ టీంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ప్రాథమికంగా మృతురాలి పేరు శ్వేత అని ప్రచారం జరిగినప్పటికీ, విచారణలో ఆమె పేరు బంగి దేబోరా అని స్పష్టమైంది. హత్య



చేసిన తర్వాత నిందితుడు నేరుగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మహనీయుల మార్గం మరిచిపోతున్న నయా జనరేషన్

( హంసకలం వార్త )

ఒక సమాజం బతికి ఉండాలంటే కేవలం ఆర్థికాభివృద్ధి,సాంకేతిక ప్రగతి,మెరుస్తున్న నగరాలు సరిపోవు.ఆ సమాజానికి చరిత్ర ఉండాలి.ఆ చరిత్రను నిర్మించిన మహనీయుల జ్ఞాపకం ఉండాలి. వారు చూపించిన మార్గం,వారు నమ్మిన విలువలు,వారు చేసిన త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలవాలి.చరిత్రను మరిచిపోయిన సమాజం దిశ కోల్పోయిన ఓడలా మారుతుంది.ఎందుకంటే... భవిష్యత్తుకు దారి చూపేది గతం నేర్పిన పాఠాలే.కానీ,నేటి పరిస్థితి చూస్తే ఆ స్పృహ క్రమంగా కనుమరుగవుతున్నట్లు కనిపిస్తోంది.యువతలో చైతన్యం ఉంది,ప్రతిభ ఉంది,అవకాశాలు ఉన్నాయి.కానీ,సమాజం పట్ల బాధ్యత తగ్గుతోంది.“నేను ఎలా ఎదగాలి?” అన్న ఆలోచన పెరుగుతుండగా...“సమాజం ఎలా మారాలి?” అనే ప్రశ్న మాత్రం మసకబారుతోంది.చరిత్రను చదవడం కంటే ట్రెండింగ్ టాపిక్ తెలుసుకోవడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నాం. మహనీయుల జీవితాల నుంచి విలువలు నేర్చుకోవడం కంటే వైరల్ వీడియోల నుంచి వినోదం పొందడానికే ఎక్కువ ఆసక్తి చూపుతున్నాం.నేటి తరం “ఇప్పుడు” అనే క్షణంలో బతుకుతోంది.“రేపు” అనే బాధ్యతను మరిచిపోతోంది. పోరాటాల చరిత్రను మరిచి, సౌకర్యాల జీవితానికే అలవాటుపడుతోంది. త్యాగం,నిబద్ధత,ప్రజాసేవ,సామూహిక చైతన్యం వంటి విలువలు క్రమంగా పుస్తకాల పేజీలకే పరిమితమవుతున్నాయి.

-మహనీయుల జీవితాలను చదవాలి

ఇలాంటి సమయంలో ప్రజల కోసం జీవితాన్నే అంకితం చేసిన మహనీయుల జీవితాలను మరోసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.అలాంటి మహనీయుల్లో ముందువరుసలో నిలిచే పేరు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య.ఆధునికత పేరుతో విలువల వలస స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌కు బందీ అయిన యువతకు సుందరయ్య ఎవరో తెలియదు. కానీ,ట్రెండింగ్ రీల్ చేసిన వాడు హీరో. లైకులు, షేర్లు,ఫాలోవర్స్ కొలమానంగా మారిన కాలంలో త్యాగం అనే పదం డిక్షనరీలోనే మిగిలిపోయింది.వ్యక్తిగత విజయం, కార్పొరేట్ ప్యాకేజీ,విదేశీ కలలు వీటి వెంట పరుగులు తీస్తున్నాం.”నేను” అనే అహం “మనం” అనే సామూహిక చైతన్యాన్ని పూర్తిగా మింగేసింది. పుచ్చలపల్లి సుందరయ్య జీవితం గురించి తెలుసుకుంటే..ఈ వలసకు విరుగుడు లభిస్తుంది. సుందరయ్య ఒక సిద్ధాంతం,ఒక ఆచరణ, ఒక ఆలోచన.సుందరయ్య రాజకీయ నాయకుడు కాదు.ఆయన ఒక జీవన విధానం.భూస్వామ్య వ్యవస్థ పునాదులను కదిలించిన తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకీ పట్టాడు. కానీ, అధికారం చేతిలోకి వచ్చినప్పుడు మాత్రం ఆదర్శాలనే ఆయుధంగా మలచుకున్నాడు. ఎంపీగా ఉన్నా సైకిల్‌పై తిరిగాడు. రైలులో స్లీపర్ క్లాస్‌లో ప్రయాణించాడు.”ప్రజల సొమ్ము ప్రజలకే చెందాలి” అనే కమ్యూనిస్టు సూత్రాన్ని శ్వాసగా పీల్చాడు.ఆస్తులు కూడబెట్టలేదు, వారసత్వ రాజకీయాలు చేయలేదు, పార్టీ ఆఫీసులోనే నిద్రపోయాడు. ఆయనకు పదవి అంటే సేవ, అధికారం అంటే బాధ్యత మాత్రమే. నేటి రాజకీయం దీనికి పూర్తి విరుద్ధం.పదవి అంటే పెత్తనం, అధికారం అంటే అవకాశం, సిద్ధాంతం అంటే సౌలభ్యం బట్టి మార్చుకునే కోటు.

-నయా జనరేషన్ కోల్పోతున్నదేమిటి

నేటి యువత ప్రశ్నించే గుణం కోల్పోతుంది. సుందరయ్య బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ప్రశ్నించాడు. నిజాం నిరంకుశత్వాన్ని ప్రశ్నించాడు.నేటి యువత ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మానేసి,ప్రభుత్వ పథకం కోసం క్యూలో నిలబడుతోంది.నేటి యువత త్యాగనిరతిని త్యజించింది.సుఖాలను వదులుకుని కష్టాలను కౌగి లించుకున్న తరం అది.సుఖం కోసం విలువలను వదులు కుంటున్న తరం ఇది.నేటి యువతలో సామూహిక స్పృహ కొరవడింది.సుందరయ్య “నా భూమి,నా పంట,నా హక్కు” అని రైతు కోసం పోరాడాడు.”నా రీల్,నా వ్యూస్,నా మోనటైజేషన్” అని నేటి యువత ఆలోచిస్తోంది.

-సోషల్ మీడియా కొత్త నల్లమందు

నాడు మార్క్స్ మతాన్ని ప్రజల పాలిట నల్లమందు అన్నాడు.నేడు సోషల్ మీడియా యువత పాలిట



నల్లమందుగా మారింది.30 సెకన్ల రీల్‌లో ప్రపంచాన్ని చూస్తున్నాం. 280 అక్షరాల్లో అభిప్రాయాన్ని ఏర్పరు చుకుంటున్నాం.లోతు లేదు, అధ్యయనం లేదు,కేవలం ఉద్వేగం. ట్రెండ్ అయి పోయాక మర్చిపోతాం. సుందరయ్య 40 ఏళ్లు జైలు జీవితం,అజ్ఞాతవాసం గడిపాడు. ఒక సిద్ధాంతం కోసం జీవితాన్నే త్యాగం చేశాడు.నేడు ఒక పోస్ట్‌కు వచ్చిన నెగటివ్ కామెంట్‌కే మనం కుంగిపోతున్నాం. జయంతి అంటే జ్ఞాపకం కాదు,రగిలే జ్వాల. పుచ్చలపల్లి సుందరయ్య జయంతి పూలదండ వేసి నివాళి అర్పించే తంతు కాదు.అది ఆత్మవిమర్శ చేసుకునే రోజు.”నేను సమాజానికి ఏం చేశాను?” అని ప్రతి యువకుడు ప్రశ్నించుకోవాలి.ఓటు వేయడం మాత్రమే ప్రజాస్వామ్యం కాదు. చెడును ప్రశ్నించడం,మంచిని నిర్మించడం,బలహీనుడి పక్షాన నిలబడడం అసలైన ప్రజాస్వామ్యం. సుందరయ్య మనకు ఇచ్చిన సందేశం ఒక్కటే బతకడం అంటే కేవలం ఊపిరి పీల్చడం కాదు, ఇతరుల కోసం బతకడం నయా జనరేషన్ సెల్ఫీ కల్చర్ నుంచి సేవా కల్చర్‌కు మారాలి.వైరల్ కావడం కాదు,విలువగా నిలవడం ముఖ్యం. ఫాలోవర్స్ కాదు,ఫాలో అయ్యే ఆదర్శం కావాలి.మహనీయుల మార్గం మరిచిపోతే మనం దారి తప్పిన ప్రయాణికులమే.చరిత్ర మనల్ని క్షమించదు.

# కొనుగోలు చేసిన వరి ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

-మిల్లులకు ధాన్యంతో వచ్చిన లారీలను త్వరగా అన్లోడ్ చేసి పంపించాలి

-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

( హంసకలం వార్త )

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం పెగడపెల్లి మండలం నంచర్ల, దేవి కొండ, రాం నగర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎండపెల్లి మండల కేంద్రంలోని వాయుపుత్ర రైస్ మిల్ మరియు గుల్ల కోట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి



రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు మరియు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లులలో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులను, మిల్లర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సివిల్ సప్లై అధికారి జితేందర్ రెడ్డి, తహసీల్దార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో టీ తాగుదామని తీసుకెళ్లి బీటెక్ విద్యార్థినిపై అత్యాచారం

-పోలీసులు కేసు నమోదు చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్

( హంసకలం వార్త )



ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థినికి మద్యం తాగించి అనంతరం ఆమెపై క్లాస్ మేట్ అత్యాచారం చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ కు చెందిన ఉదయ్ అనే యువకుడు ఇబ్రహీంపట్నం లోని ఓ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తనతో చదువుతున్న యువతిని టీ తాగుదామని కారులో దిల్ సుఖ్ నగర్ తీసుకెళ్లాడు. అనంతరం తిరిగి వస్తుండగా మద్యం కొనుగోలు చేసి బిడిఎల్ రోడ్డులో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి యువతికి బలవంతంగా మద్యం తాగించాడు. అనంతరం యువతిని తన గదిలోనికి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. వెంటనే ఆమెఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించించారు

# ఎండ ప్రచండం

-జిల్లాలో నిప్పులు కక్కుతున్న భానుడు

-ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం

-జిల్లాలో 45 డిగ్రీలు దాటిపోతున్న ఉష్ణోగ్రతలు

-పెరుగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలతో జనం ఇబ్బందులు

-కర్కటక రేఖ ఎఫెక్ట్‌తో జిల్లాలో రికార్డుస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు

( హంసకలం వార్త )

జిల్లాలో భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మంట రేపుతున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత వారం రోజుల క్రితం కొద్దిపాటి వర్షాలతో శాంతించిన భానుడు మళ్లీ నిప్పులు కక్కుతున్నాడు. ఈసారి వేసవిలో జిల్లాలో రికార్డుస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటగా శనివారం 45.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. భూతాపం, ఎల్‌నినో ప్రభావం, బలమైన సౌరవికిరణం వల్ల జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల నుంచి 46 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడంతో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావం జిల్లా కర్కాటక రేఖకు సమీపంగా ఉండడంతో రికార్డుస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భౌగోళికంగా జిల్లా దక్కన్ పీఠభూమి ప్రాంతంలో ఉండడం వల్ల వేసవిలో భూమి వేడిని ఎక్కువగా గ్రహిస్తోంది. జిల్లా సముద్ర తీరానికి దూరంగా ఉండడంతో చల్లని గాలుల ప్రభావం తక్కువగా ఉండడంతో ఎండ తీవ్రత ఎక్కువవుతోంది. జిల్లాలో గత కొన్నేళ్లుగా చెట్లు తగ్గడం, పట్టణీకరణ పెరగడంతో దాని ప్రభావంతో చల్లదనం తగ్గిపోతుంది. వాతావరణశాఖ గణాంకాల ప్రకారం ?గత వారం రోజుల్లో జిల్లాలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు పదేళ్లలో వేడిగాలుల తీవ్రత గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది.

-నేరుగా పడుతున్న సూర్యకిరణాలు

కర్కాటక రేఖకు తెలంగాణ సమీపంలో ఉండడంతో వేసవిలో సూర్యకిరణాలు దాదాపుగా నిటారుగా భూమిపై పడుతున్నాయి. రాష్ట్రంలో 15 నుంచి 19 ఉత్తర అక్షాంశాల మధ్య ఉండడంతో ఏప్రిల్, మే నెలల్లో సూర్య కిరణాల ప్రభావం అధికమవుతోంది. ఫలితంగా భూమి ఉపరితలం వేడిని వేగంగా గ్రహించి మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న వాతావరణ మార్పులతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. మహారాష్ట్ర, ఉత్తర తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చే పొడివేడి గాలుల ప్రభావం జిల్లాపై తీవ్రత చూపుతున్నట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

-యేడాదికేడాది పెరుగుతున్న వేడి

వాతావరణశాఖ అధికారుల లెక్కల ప్రకారం ప్రతీ యేడాది జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. 1990లో జిల్లాలో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 39 డిగ్రీలుగా ఉండగా ప్రస్తుతం సగటు ఉష్ణోగ్రత 40.5 డిగ్రీల నుంచి 41 డిగ్రీల మధ్య నమోదవుతోంది. గతమూడు దశాబ్దాలలో సగటు ఉష్ణోగ్రత దాదాపు 1 నుంచి 1.5 డిగ్రీలకు పెరిగింది. గతంలో సంవత్సరానికి 5 నుంచి 10 లోపు వేడిగాలులు నమోదయ్యేవి. ఇప్పుడు అవి 15 నుంచి 20 వరకు నమోదవుతున్నాయంటే జిల్లాలో వేడి తీవ్రత రోజురోజుకు పెరుగుతుందనేది స్పష్టమవుతోంది.

-తగ్గుతున్న పచ్చదనం

జిల్లాలో పట్టణీకరణ వేగంగా పెరుగుతుండడంతో అడవుల విస్తీర్ణం తగ్గడం, చెట్లు నరికివేత, కాంక్రీట్ నిర్మాణాల వల్ల చెట్ల సంఖ్య తగ్గిపోతోంది. నగర ప్రాంతాల్లో రోడ్లు, భవనాలు కాంక్రీట్ నిర్మాణాలతో వేడి ఎక్కువ సేపు నిల్వ ఉంటుంది. దీన్ని వాతావరణ శాఖ అధికారులు హీట్ ఐలాండ్ ఎఫెక్ట్‌గా ధృవీకరిస్తున్నారు. సిమెంట్ నిర్మాణాలు పగటిపూట వేడిని గ్రహించి రాత్రి విడుదల చేయడంతో రాత్రి పూట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల కంటే తక్కువగా నమోదు కావడంలేదు. దీంతో ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9గంటల నుంచే వేడి గాలుల ప్రభావంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

-భవిష్యత్తుపై ప్రభావం

?వాతావరణ మార్పుల ప్రభావం ఇలానే కొనసాగితే 2035 నాటికి తెలంగాణలో వేసవి గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరో 1 నుంచి 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అటవీ విస్తీర్ణం తగ్గడం, అవసరాల కోసం చెట్లను నరికివేయడం వంటి కారణాల వల్ల పచ్చదనం తగ్గిపోతుంది. చెరువులు, కుంటలు సైతం ఎండిపోవడంతో నీటి లభ్యత తగ్గి వాతావరణంలో చల్లదనం తగ్గుతుంది. భూగర్భ జలాల మట్టం తగ్గి దీని ప్రభావం వేడి తీవ్రతను పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. చెరువుల పునరుద్ధరణ, మొక్కల పెంపకం, పట్టణాల్లో హరితవనాల అభివృద్ధి కార్యక్రమాలు చేయడంతో కొంతమేరకైనా వాతావరణ పరిస్థితులను తగ్గించే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

# బిజినెస్

## ఐటీ షేర్ల జోరు: ఆరు శాతం వరకు జంప్..


- నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 4% జంప్
- కోఫోర్జ్ షేరు 6 శాతం మేర పెరుగుదల
- రూపాయి విలువ పడిపోవడం ఐటీ కంపెనీలకు లాభం
- తక్కువ ధర వద్ద కొనుగోళ్లకు ఇన్వెస్టర్ల మొగ్గు



గత కొన్ని వారాలుగా తీవ్ర నష్టాల్లో ఉన్న భారత ఐటీ రంగ షేర్లు మంగళవారం ఒక్కసారిగా పుంజుకున్నాయి. కోఫోర్జ్, ఎంఫసిస్, పర్సిస్టెంట్ సిస్టమ్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ప్రముఖ ఐటీ కంపెనీల షేర్లు కొనుగోళ్ల మద్దతుతో ఆరు శాతం వరకు లాభపడ్డాయి. దీంతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు నాలుగు శాతం మేర ముందంజ వేసింది. కోఫోర్జ్ అత్యధికంగా ఆరు శాతం పెరగ్గా.. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పర్సిస్టెంట్ సిస్టమ్స్ షేర్లు 4 నుంచి 5 శాతం వరకు లాభపడ్డాయి. గత కొన్ని నెలలుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ వల్ల సాంప్రదాయ సాఫ్ట్‌వేర్, కోడింగ్ ఉద్యోగాలకు ముప్పు వస్తుందనే భయాలు మార్కెట్‌ను కమ్మేశాయి. ఇటీవలే ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ సంస్థలు విడుదల చేసిన సరికొత్త ఏఐ ఏజెంట్ల వల్ల ఐటీ కంపెనీల ఔట్‌సోర్సింగ్ బిజినెస్ దెబ్బతింటుందనే ఆందోళనలతో ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి. వాల్యుయేషన్లు 2008 నాటి సంక్షోభం స్థాయికి పడిపోయాయి. దీంతో ఇన్వెస్టర్లు ఇప్పుడు తక్కువ ధరకు లభిస్తున్న నాణ్యమైన ఐటీ షేర్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించారు.

## యూపీఐ చెల్లింపుల కోసం ఇక పేరెంట్స్ ఫోన్ అక్కర్లేదు..

# పేటీఎం 'పాకెట్ మనీ' వచ్చేసింది!




డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎం, టీనేజర్లను లక్ష్యంగా చేసుకుని మరో కీలకమైన ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'పేటీఎం పాకెట్ మనీ' పేరుతో నేడు ప్రారంభించిన ఈ కొత్త సదుపాయం ద్వారా బ్యాంకు ఖాతా లేని టీనేజర్లు కూడా నేరుగా యూపీఐ చెల్లింపులు చేసేందుకు అవకాశం కలుగుతుంది. నగదు కోసం లేదా చెల్లింపులు పూర్తి చేయడానికి తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం ఉందని కంపెనీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన ప్రకటనలో తెలిపింది. ఈ ఫీచర్ ద్వారా తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులు తమ పిల్లల నెలవారీ ఖర్చులకు పరిమితి విధించవచ్చు. అంతేగాక వారు చేసే యూపీఐ లావాదేవీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చు. "పేటీఎం స్పెండ్ సమ్మరీతో కుటుంబాలు తమ పిల్లల ఖర్చుల సరళిని సమీక్షించుకోవచ్చు. వారికి ఇచ్చే పాకెట్ మనీని మెరుగ్గా నిర్వహించడంతో పాటు సురక్షితమైన, బాధ్యతాయుతమైన అలవాట్లను చిన్నతనం నుంచే నేర్పించవచ్చు" అని పేటీఎం ఒక ప్రకటనలో పేర్కొంది. పాఠశాల, కళాశాల క్యాంటీన్లు, మెట్రో రైళ్లు, క్యాబ్‌లు, మొబైల్ రీఛార్జ్‌లు, షాపింగ్ వంటి రోజువారీ అవసరాలకు ఈ ఫీచర్ టీనేజర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

### 'పేటీఎం పాకెట్ మనీ' ఎలా పనిచేస్తుంది?

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) 2024 ఆగస్టులో ప్రవేశపెట్టిన 'యూపీఐ సర్కిల్' ఫీచర్ ఆధారంగా ఈ సేవ పనిచేస్తుంది. యూపీఐ సర్కిల్ ద్వారా బ్యాంకు ఖాతా కలిగిన ప్రాథమిక యూజర్ (తల్లి/తండ్రి), తమ కుటుంబ సభ్యులను లేదా నమ్మకమైన వారిని సెకండరీ యూజర్‌గా చేర్చుకోవచ్చు. దీనివల్ల ఒకే బ్యాంకు ఖాతాకు సంబంధించిన యూపీఐ ఐడీని ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉపయోగించుకోవచ్చు. అయితే, లావాదేవీలపై పూర్తి నియంత్రణ, పరిమితులు విధించే అధికారం ప్రాథమిక యూజర్‌కే ఉంటుంది. ఒకసారి యాక్టివేట్ అయిన తర్వాత టీనేజర్లు తమ సొంత మొబైల్ ఫోన్‌లోని పేటీఎం యాప్ ద్వారా సురక్షితంగా యూపీఐ చెల్లింపులు చేయవచ్చు. "ఇకపై టీనేజర్లు చెల్లింపుల కోసం తమ తల్లిదండ్రుల ఫోన్ తీసుకోవడం, ఓటీపీల కోసం అడగడం లేదా క్యూఆర్ కోడ్‌ను వాట్సాప్‌లో పంపడం వంటివి చేయాల్సిన అవసరం లేదు" అని కంపెనీ పేర్కొంది.

### పరిమితులు.. భద్రతా నియంత్రణలు

తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఈ పాకెట్ మనీని సెటప్ చేసేటప్పుడు, లావాదేవీలపై పరిమితులు విధించవచ్చు. ప్రతి లావాదేవీ గరిష్ఠంగా రూ. 5,000, నెలవారీ మొత్తం ఖర్చు రూ. 15,000 మించకుండా పరిమితి ఉంటుంది. భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఫీచర్ సెటప్ చేసిన మొదటి 30 నిమిషాల్లో రూ. 500, మొదటి 24 గంటల్లో రూ. 5,000 వరకు మాత్రమే చెల్లింపులు చేయగలరు. ఈ ఫీచర్ వాడటానికి డివైస్ లాక్ తప్పనిసరి. తల్లిదండ్రులు తమ పేటీఎం యూపీఐ పిన్ ఉపయోగించి ఎప్పుడైనా ఈ పరిమితులను మార్చవచ్చు లేదా యాక్సెస్‌ను తక్షణమే రద్దు చేయవచ్చు.

## భారత్‌లో బీబీఎల్ మ్యాచ్‌లు.. క్రికెట్ లవర్స్ కు పండగే!




ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత టీ20 లీగ్, బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) మ్యాచ్‌ను భారత్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో చెన్నైలోని ఎంఏ చిదంబరం (చెపాక్) స్టేడియంలో బీబీఎల్ 2026-27 సీజన్‌కు చెందిన ఒక మ్యాచ్‌ను నిర్వహించే ప్రతిపాదనపై బీసీసీఐ, క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ), తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ (టీఎన్‌సీఏ) మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ మూడు సంస్థల మధ్య అధికారిక ఒప్పందం ఇంకా ఖరారు కానప్పటికీ, మిగిలిన ప్రక్రియలన్నీ కేవలం పరిపాలనాపరమైనవేనని సంబంధిత అధికారులు భావిస్తున్నారు. భారత్, ఆస్ట్రేలియా ప్రభుత్వాల మధ్య క్రీడా సహకార కార్యక్రమాల్లో భాగంగా ఈ ప్రతిపాదనకు ఇరు దేశాల ప్రభుత్వాల మద్దతు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు 'క్రిక్‌బజ్' ఒక కథనాన్ని ప్రచురించింది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం, ఇటీవల క్రికెట్ ఆస్ట్రేలియా, బీబీఎల్ ప్రతినిధుల బృందం చెన్నైలో పర్యటించి చెపాక్ స్టేడియంలోని సౌకర్యాలను పరిశీలించింది. ఈ మ్యాచ్‌ను డిసెంబర్ రెండో లేదా మూడో వారంలో నిర్వహించే అవకాశం ఉంది. "ఇంకొన్ని వారాల్లో క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి స్పష్టత వస్తుంది. వారి సభ్యులు ఐపీఎల్ మ్యాచ్‌కు హాజరయ్యారు. పూర్తి సమాచారంతో మళ్లీ సంప్రదిస్తామని చెప్పారు" అని టీఎన్‌సీఏ అధికారి ఒకరు తెలిపినట్టు ఆ కథనం పేర్కొంది. సోమవారం చెన్నైలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మిన్హాస్, తాత్కాలిక సీఈఓ హేమాంగ్ అమిన్ కూడా సీఏ ప్రతినిధులతో చర్చల్లో పాల్గొన్నారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, భారత గడ్డపై ఒక విదేశీ ఫ్రాంచైజీ టీ20 లీగ్ మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి అవుతుంది. ఇది భవిష్యత్తులో మరిన్ని క్రాస్-లీగ్ సహకారాలకు మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు.

## ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు భారత జట్టు ప్రకటన.. గిల్‌కు కెప్టెన్సీ, కొత్త ముఖాలకు చోటు!



జూన్ 6 నుంచి ఆఫ్ఘనిస్థాన్ తో జరగబోయే ఏకైక టెస్ట్ మ్యాచ్, మూడు వన్డేల సిరీస్ కోసం బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. ఈ టూర్‌లో టెస్ట్‌తో పాటు వన్డే జట్టుకు కెప్టెన్‌గా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వ్యవహరించనున్నాడు. టెస్ట్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలను కేఎల్ రాహుల్‌కు అప్పగించారు. ఆంధ్రా క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి టెస్టు, వన్డే జట్లకు రెండింటికీ ఎంపికయ్యాడు. వన్డే జట్టులోకి శ్రేయస్ అయ్యర్ తిరిగి రావడమే కాకుండా వైస్ కెప్టెన్ బాధ్యతలనూ దక్కించుకున్నాడు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని వన్డే జట్టుకు ఎంపిక చేశారు. అయితే రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా ఎంపిక వారి ఫిట్‌నెస్ ఆధారంగానే ఖరారవుతుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. ఈ సిరీస్ ద్వారా హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ టెస్టులు, వన్డేల్లో అరంగేట్రం చేయనుండగా.. ప్రిన్స్ యాదవ్ వన్డేల్లో అరంగేట్రం చేయనున్నాడు. మానవ్ సుతార్ టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడు.

**వన్డే జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ (ఫిట్‌నెస్ ఆధారంగా), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, హార్దిక్ పాండ్యా (ఫిట్‌నెస్ ఆధారంగా), ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, గుర్నూర్ బ్రార్

**టెస్ట్ జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, నితీశ్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్.

# స్పోర్ట్స్

## ధోనీ రిటైర్మెంట్ హింట్ ఇచ్చారా? రైనా వెల్లడించిన ఆసక్తికర విషయం




చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజం ఎం.ఎస్ ధోనీ ఐపీఎల్ భవిష్యత్తుపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే ఆయన వచ్చే సీజన్‌లోనూ ఆడాలని సీఎస్‌కే మాజీ స్టార్ సురేష్ రైనా ఆకాంక్షించాడు. చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై ఓటమి తర్వాత 'స్టార్ స్పోర్ట్స్'తో రైనా మాట్లాడాడు. ఈ సందర్భంగా ధోనీ రిటైర్మెంట్ పై వారిద్దరి మధ్య జరిగిన ఒక సంభాషణను పంచుకున్నాడు. "నేను ధోనీతో మాట్లాడాను. నువ్వు ఐపీఎల్ 2026 సీజన్‌కు కేవలం మిస్డ్‌కాల్ ఇచ్చావంతే. ఇది లెక్కలోకి రాదు. వచ్చే ఏడాది కచ్చితంగా ఆడాల్సిందేనని నేను అతడితో అన్నాను" అని రైనా వెల్లడించాడు. దానికి ధోనీ స్పందిస్తూ.. "నా శరీరం కొంచెం బలహీనంగా అనిపిస్తోంది" అన్నాడని రైనా తెలిపాడు. అయితే "మేం అవేమీ నమ్మం. నువ్వు వచ్చే ఏడాది ఆడాల్సిందేనని నేను స్పష్టం చేశాను" అని రైనా వెల్లడించాడు. ఇది ధోనీ వ్యక్తిగత నిర్ణయమైనప్పటికీ అతను మాత్రం పాజిటివ్‌గానే ఉన్నట్లు తనకు అనిపించిందని తెలిపాడు. ధోనీ ఈ సీజన్ మొత్తం తుది జట్టులో లేడు. కనీసం స్టేడియంలో కూడా కనిపించలేదు. కానీ నిన్న అతణ్ని చెపాక్‌లో చూసి ఫ్యాన్స్ భావోద్వేగానికి గురయ్యారు. టీమ్ ఫొటోగ్రాఫ్ కోసం మైదానంలోకి రాగానే స్టేడియం దద్దరిల్లింది. ఎలాంటి స్పీచ్ ఇవ్వకుండానే, బౌండరీ లైన్ వెంట నడుస్తూ అభిమానులకు అభివాదం చేశాడు. 44 ఏళ్ల ధోనీ చెపాక్ హోమ్ గ్రౌండ్‌లో కనిపించడం ఇదే చివరిసారి కావచ్చనే బాధతో ఫ్యాన్స్ భావోద్వేగంతో నినాదాలు చేశారు. మరోవైపు రైనాతో ధోనీ వ్యాఖ్యలు, చెపాక్‌లో కనిపించి అభివాదం చేయడం ఆయన రిటైర్మెంట్ హింట్ అయ్యుండొచ్చని పలువురు విశ్లేషిస్తున్నారు.

హంస కలం వార్త
బుధవారం 20 మే 2026

# సినిమా అనేది ఉద్యోగం కాదు.. ఒక లైఫ్ స్టైల్: రానా

- సినిమా అనేది ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చే ఉద్యోగం కాదన్న రానా
- ఇండస్ట్రీ అనేది వస్తువులను తయారు చేసే ఫ్యాక్టరీ కాదని వ్యాఖ్య
- వరుసగా 15 గంటలు పని చేసినా ఆశించిన స్థాయిలో సీన్ రాకపోవచ్చన్న రానా



టాలీవుడ్ నటుడు దగ్గుబాటి రానా ఒకవైపు వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తూ, మరోవైపు నిర్మాతగా కూడా క్రేజీ ప్రాజెక్ట్‌లను పట్టాలెక్కిస్తూ చిత్ర పరిశ్రమలో తన ప్రత్యేక ముద్రను చాటుకుంటున్నారు. ఇటీవల 'కాంత' అనే డిఫరెంట్ కంటెంట్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రానా, నటుడిగా మంచి మార్కులు కొట్టేసినా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి కమర్షియల్ సక్సెస్ అందుకోలేకపోయారు. మరోవైపు, చలనచిత్ర పరిశ్రమ పనితీరు, షూటింగ్స్ సమయంలో పడే కష్టం గురించి రానా చేసిన ఆసక్తికరమైన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. "సినిమా అనేది కేవలం ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చే ఉద్యోగం లాంటిది కాదు, అది ఒక లైఫ్‌స్టైల్. ఆ జీవనశైలిలో మీరు కొనసాగాలా వద్దా అనేది పూర్తిగా మీ ఇష్టంపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. ఇక్కడ ప్రతి సినిమా కూడా మేకర్స్ నుంచి, నటీనటుల నుంచి ఇంకేదో ఒక కొత్త విషయాన్ని ఆశిస్తూనే ఉంటుంది. కేవలం ఎనిమిది గంటలు డ్యూటీ చేస్తే ఒక అత్యుత్తమమైన సన్నివేశం వచ్చేస్తుందని అనుకోవడానికి ఇదేమీ వస్తువులను తయారుచేసే ఫ్యాక్టరీ కాదు" అని రానా స్పష్టం చేశారు. సినిమా మేకింగ్ వెనుక ఉండే అంకితభావాన్ని వివరిస్తూ.. "కొన్నిసార్లు మనం సెట్స్‌పై వరుసగా 15 గంటల పాటు ఎంతో కష్టపడి షూటింగ్ చేసినా కూడా, ఆశించిన స్థాయిలో ఒక్క మంచి సీన్ కూడా రాకపోవచ్చు. సినిమా అనేది పూర్తిగా మనం చేసే ప్రాజెక్ట్‌ను బట్టి, అందులోని సిచ్యుయేషన్లను బట్టి మారుతూ ఉంటుంది" అని రానా చెప్పుకొచ్చారు. కేవలం గంటల లెక్కన కాకుండా, క్రియేటివిటీ కోసం ఎంతటి శ్రమనైనా ఓర్చడమే సినిమా రంగం ప్రత్యేకత అని ఆయన విశ్లేషించారు.

# ఇళయరాజాకు 'కరుప్పు' టీమ్ క్షమాపణ

- సూర్య, త్రిష జంటగా నటించిన 'కరుప్పు' సినిమా
- సినిమాలో ఇళయరాజాను ఉద్దేశిస్తూ కొన్ని డైలాగులు
- ఇళయరాజాను అగౌరవపరచడం తమ ఉద్దేశం కాదన్న చిత్ర యూనిట్



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, అగ్ర నటి త్రిష జంటగా నటించిన తాజా చిత్రం 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు'). టాలెంటెడ్ డైరెక్టర్ ఆర్ జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో భారీ కలెక్షన్లతో, హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. హీరో సూర్య కెరీర్‌లో ఇదొక పవర్‌ఫుల్ కమ్ బ్యాక్ హిట్‌గా నిలిచింది. అయితే, ఒకవైపు బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధిస్తున్నప్పటికీ.. మరోవైపు ఈ చిత్రంలోని కొన్ని డైలాగులు ఇప్పుడు పెద్ద వివాదానికి దారితీశాయి. ఈ చిత్రంలో భారతీయ సంగీత ప్రపంచంలోనే లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్‌గా పేరొందిన ఇళయరాజాను ఉద్దేశిస్తూ కొన్ని డైలాగ్స్ ఉన్నాయి. ఆ డైలాగులు ఆయన స్థాయిని, గౌరవాన్ని తగ్గించేలా ఉన్నాయంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు, ఆయన అభిమానులు చిత్ర బృందంపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. వివాదం ముదురుతుండటంతో 'కరుప్పు' మూవీ టీమ్ స్పందించింది. ఇళయరాజాకు క్షమాపణలు చెబుతూ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇళయరాజాపై తమకు ఎంతో గౌరవం ఉందని, భారతీయ సినీ రంగానికి ఆయన చేసిన సేవలు... ఎందరో నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ఎన్నో తరాలుగా స్ఫూర్తిని నింపుతూనే ఉన్నాయని చిత్ర బృందం పేర్కొంది. సినిమాలో ఆయనను ఉద్దేశిస్తూ ఉన్న ఒక డైలాగ్ వల్ల ఆయన బాధ పడ్డారనే విషయం తమ దృష్టికి వచ్చిందని, అందువల్ల తాము ఇళయరాజాను మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నామని తెలిపారు. ఆయనను అగౌరవపరచడం తమ ఉద్దేశం ఎంతమాత్రం కాదని స్పష్టం చేశారు. వివాదానికి కారణమైన ఆ నిర్దిష్ట సీన్లను, డైలాగులను సినిమాలోంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. థియేటర్లలో ఈ రోజు నుంచే ఆ మార్పులు అమలులోకి వస్తాయని వెల్లడించారు. చలనచిత్ర పరిశ్రమలో అందరి గౌరవమే తమకు ప్రధానమని.. కాబట్టి, దయచేసి ఈ విషయాన్ని ఇంతటితో ముగించాలని కోరారు. దీనిని మరింత కాంట్రవర్సీగా మార్చి సోషల్ మీడియాలో ఎలాంటి తప్పుడు వార్తలను, ఊహాగానాలను సృష్టించవద్దని వారు వేడుకున్నారు.

# 'బ్యాడ్ బాయ్ కార్తీక్' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ




తెలుగు తెరపై హ్యాండ్ సమ్ కటౌట్ గా కనిపించే హీరోలలో నాగశౌర్య ఒకరు. ఆరంభంలోనే వరుస విజయాలను అందుకుంటూ వచ్చిన నాగశౌర్య, ఆ తరువాత లవర్ బాయ్ ఇమేజ్ నుంచి బయటకి రావడం కోసం, యాక్షన్ పాళ్లు ఎక్కువగా ఉన్న కథలను ఎంచుకుంటూ వచ్చాడు. అలా ఆయన చేసిన సినిమానే 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. ఏప్రిల్ 17వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 15వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. కార్తీక్ (నాగశౌర్య) తన అక్కయ్య కస్తూరి (శ్రీదేవి విజయ్ కుమార్) ... బావ వాసు (అజయ్)తో కలిసి 'వైజాగ్' లో నివసిస్తూ ఉంటాడు. శ్రీదేవి అడ్వకేట్ గా పనిచేస్తూ ఉంటుంది. అదే వైజాగ్ లో సాయి విక్రమ్ (సాయి కుమార్) పోలీస్ ఆఫీసర్ గా ఉంటాడు. ఆయన కూతురు 'మహా' (విధి యాదవ్)ను కార్తీక్ ఇష్టపడుతూ ఉంటాడు. బీటెక్ పూర్తిచేసిన కార్తీక్, ఊళ్లో అల్లర చిల్లరగా తిరుగుతూ ఉండటంతో, అతణ్ణి పై చదువుల కోసం ఫారిన్ పంపించాలనే ఆలోచనలో కస్తూరి ఉంటుంది. 'కదిరి'లో వరదారెడ్డి (సముద్రఖని) గోవిందప్ప (మైమ్ గోపీ) మధ్య ఫ్యాక్షన్ గొడవలు నడుస్తూ ఉంటాయి. వరదారెడ్డి చెల్లెలు గోవిందప్ప అన్నయ్య మునెప్పను ప్రేమిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న వరదారెడ్డి, తన వాళ్లతో మునెప్పను చంపిస్తాడు. అప్పటి నుంచి వరదారెడ్డిపై ప్రతీకారంతో గోవిందప్ప రగిలిపోతుంటాడు. సరైన సమయం కోసం అతను వెయిట్ చేస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలోనే తన అక్కయ్య కస్తూరిని హత్య చేయించడానికి గోవిందప్ప ప్రయత్నిస్తున్న విషయం కార్తీక్ కి తెలుస్తుంది. అందుకు గల కారణం ఏమిటనేది తెలుసుకోవడం కోసం, కార్తీక్ వైజాగ్ నుంచి కదిరి వెళతాడు. అక్కడ ఏం జరుగుతుంది? కస్తూరి పై గోవిందప్పకి గల కోపానికి కారణం ఏమిటి? వరదారెడ్డితో ముడిపడిన ఆ అక్కాతమ్ముళ్ల గతం ఎలాంటిది? అనేది కథ. ఈ కథ వైజాగ్ - కదిరి మధ్య జరుగుతుంది. ఇది అక్కాతమ్ముళ్ల ఎమోషన్స్ కి సంబంధించిన కథ. ఈ రెండు పాత్రలతో పాటు అంతే ప్రధానమైనవిగా వరదారెడ్డి - గోవిందప్ప పాత్రలు కనిపిస్తాయి. ఈ నాలుగు పాత్రలను ప్రధానంగా చేసుకునే ఈ కథ ముందుకు వెళుతూ ఉంటుంది. ఇక ఆ తరువాత స్థానంలో సాయికుమార్ .. అతని కూతురు మహా (హీరోయిన్) పాత్రలు ముఖ్యమైనవిగా దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. ఒక వైపున వైజాగ్ లో తమ్ముడు గురించి అక్క ఆందోళన చెందుతూ ఉంటుంది. మరో వైపున కదిరిలో విలన్స్ మధ్య గొడవగా ఉంటుంది. ఈ రెండు ట్రాకుల మధ్య సంబంధం ఉందనే విషయాన్ని దర్శకుడు హింట్ ఇస్తూ వెళుతుంటాడు. ఆ ఫ్లాష్ బ్యాక్ ఏమిటనేది తెలుసుకోవాలనే కుతూహలంతో ప్రేక్షకులు ఉంటారు. దర్శకుడు ఈ విషయాన్ని రివీల్ చేసిన తీరు కూడా బాగుంది .. ఆ ట్విస్ట్ చాలా కీలకమైనదని కూడా అనిపిస్తుంది. ఇంటర్వెల్ బ్యాంగ్ .. ఆ తరువాత కథపై ఆసక్తిని పెంచేదిలా ఉంటుంది. సెకండాఫ్ లో కార్తీక్ కోసం వరదారెడ్డి అనుచరులు గాలించడం .. అక్కాతమ్ముళ్ల ఫ్లాష్ బ్యాక్ రివీల్ అయ్యేవరకూ బాగానే అనిపిస్తుంది. ఇక ఎప్పుడైతే వెన్నెల కిశోర్ ఎంట్రీ ఇస్తాడో అప్పటి నుంచి కథ కాస్త కామెడీ వైపు టర్న్ తీసుకుని చప్పబడిపోయినట్టుగా అనిపిస్తుంది. నాగశౌర్య పాత్రను, సముద్రఖని .. మైమ్ గోపీ పాత్రలను డిజైన్ చేసిన తీరు బాగుంది. వాళ్ల నటన కూడా బాగుంది. కార్తీక్ .. అతని లవర్ కి సంబంధించిన రొమాన్స్ కి అవకాశం లేకుండా చేశారు. అందువలన ఆ వైపు నుంచి ఆడియన్స్ కి మిగిలేది నిరాశే. ఇక సాయికుమార్ పాత్రను డిజైన్ చేయడంలో కూడా క్లారిటీ లేదనిపిస్తుంది. అలాగే ఎలాంటి విషయం లేకుండా అజయ్ పాత్రను వదిలేశారు. రసూల్ ఎల్లోర్ ఫొటోగ్రఫీ బాగుంది. హారీస్ జైరాజ్ సంగీతం ఫరవాలేదు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ ఓకే. కథలోని అక్కాతమ్ముళ్ల ఫ్లాష్ బ్యాక్ కి సంబంధించిన ట్విస్ట్ బాగుంది. కానీ ఎమోషన్స్ వైపు నుంచి .. యాక్షన్ వైపు నుంచి నడిచే డ్రామా రొటీన్ గా అనిపిస్తుంది. రొమాన్స్ కి ఛాన్స్ ఇవ్వకపోవడం మరో లోపంగా అనిపిస్తుంది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449